అంధకారంలో 'పురం' పారిశ్రామికవాడ.!

◆తరుచూ ప్రమాదాలు, దొంగతనాలు ◆పట్టించుకోని ఏపీఐఐసీ

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం తూమకుంట, గోళాపురం పారిశ్రామిక వాడను అంధకారం కమ్ము కుంది. ఇటీవల పారిశ్రామిక వాడకు మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు పేరును నామకరణం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న పారిశ్రామిక వాడపై ఏపీఐఐసీ అధికా రుల నిర్లక్ష్యం కొనసాగుతోంది. కనీసం వీధి దీపాలు లేక రాత్రిళ్లు చిమ్మచీకటి అలముకుంటోంది. పారిశ్రామిక వాడలో దాదాపు 100కు పైగా వివిధ పరిశ్రమలు ఉన్నాయి. ఆయా పరిశ్రమల్లో సుమారు 50 వేల మంది కార్మికులు విధులు నిర్వ హిస్తున్నారు. వీధిదీపాలు లేక రాత్రిళ్లు కార్మికుల రాకపోకల సమయంలో తర చూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా యి. ఇటీవల ఇదే ప్రాంతంలో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారీ చోరీ జరిగింది. పరిస్థితి ఇలా ఉన్నా ఏపీఐఐసీ అధికారులు వీధిదీపాలు ఏర్పాటు చేయిద్దామనే ఆలోచనకు కూడా రాకపో వడం గమనార్హం. ఇక ఇదే ప్రాంతంలో పరిశ్రమ కోసం తీసుకున్న స్థలంలో భవనాలను నిర్మాణం చేసి ఆ భవనంలో మద్యం దుకాణాలు పెట్టి మద్యం విక్రయాలు చేయిస్తున్నారు. మద్యం అమ్మకాలు చేయరాదంటూ నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారే తప్ప పూర్తి నియంత్రణ చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యం వీడి పురం పారిశ్రామిక వాడలో వీధి దీపాలను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న కార్మికుల కోరుతున్నారు.

వీధి దీపాలు లేక అంధకారంలో ఉన్న పురం పారిశ్రామిక వాడలోని వీధులు

అర్జీలపై నిర్లక్ష్యం వద్దు

కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

అర్జీదారుడితో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇచ్చే అర్జీదారుల సమస్యలపై నిర్లక్ష్యం చూపకుండా నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలతో 243 అర్జీలను స్వీకరించారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఇన్‌ఛార్జి డిఆర్ఒ సూర్యనారాయణ రెడ్డి, ఆర్డీవో సువర్ణ ఇందులో పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల వినతులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, పారదర్శకంగా విచారణ చేసి పెండింగ్ లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు. నిర్ణీత గడువులోగా అర్జీదారుడు సంతృప్తి చెందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

కోటీ మొక్కలు నాటి పరిరక్షించాలి

జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ అన్ని శాఖల అధికారులు, అటవీ శాఖ, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు, విద్యాసంస్థలు కోటి మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ అటవీశాఖ వన విభాగం అధికారులు కలెక్టర్, జెసి, ఇతర అధికారులకు మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో మొక్కలు నాటడానికి 15 లక్షల మొక్కలు సిద్ధంగా ఉన్నాయని కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ మిగతా అవసరమైన మొక్కలు ఇతర ప్రాంతాల నుంచి తెప్పించాలన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న 15 లక్షల మొక్కలను అక్టోబర్ 2వ తేదీ నాటికి నాటాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి చక్రపాణి, ఫారెస్ట్ అధికారి శ్రీనివాసులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వికలాంగురాలి సమస్యపై కలెక్టర్ ఆరా

వికలాంగురాలి సమస్యను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు స్వీకరించిన కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ కలెక్టరేట్ నుంచి బయలుదేరుతుండగా బయట వేచి ఉన్న ఓ వికలాంగురాలిని చూసి ఆమె దగ్గరకు వెళ్లారు. సమస్య ఏమిటంటూ ఆమెను అడిగి తెలుసుకున్నారు. గుడిబండ మండలం రాళ్లపల్లి గ్రామానికి చెందిన వికలాంగురాలు పుట్ల తిమ్మక్క తన సమస్యను తెలియజేసింది. తమ కుటుంబం ఆధీనంలో ఉన్న ఎకరా భూమికి 1బి ధ్రువీకరణ పత్రంతో పాటు పాసు పుస్తకంలో నమోదు చేయించాలని పలుమార్లు అక్కడ రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. మీరైనా స్పందించి న్యాయం చేయాలని తిమ్మక్క వేడుకుంది. స్పందించిన కలెక్టర్ వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడారు. పరిశీలించి ఆమెకు న్యాయం చేయాలని సూచించారు. ఇదే సమయంలో అక్కడున్న మరి కొందరు వికలాంగుల సమస్యలను కలెక్టర్ స్వయంగా అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడారు.

డీఎస్పీ కార్యాలయం వద్ద పడుకుని నిరసన తెలుపుతున్న జెసి.ప్రభాకర్‌రెడ్డి

పోలీసులపై 'జెసి' మండిపాటు

టిడిపి కార్యకర్తలను వేధిస్తున్నారంటూ ఆగ్రహం డీఎస్పీ కార్యాలయం వద్ద నిరసన

ప్రజాశక్తి-తాడపత్రి రూరల్

తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి పోలీసులపై ఫైర్ అయ్యారు. టిడిపి కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారంటూ మండిపడ్డారు. పోలీసుల తీరుకు వ్యతిరేకంగా డీఎస్పీ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన చేపట్టారు. అనంతరం అశోక్ పిల్లర్ వద్ద తమ కార్యకర్తలతో కలిసి రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి వస్తున్న సమయంలో, వినాయక చవితి నిమజ్జనం సందర్భంగా జరిగిన సంఘటనల్లో టిడిపి కార్యకర్తలపై కేసులు నమోదు చేయడాన్ని ఆయన తప్పుపట్టారు. తాడిపత్రి పోలీసులు వారి వైఖరి మార్చుకోకపోతే ఎంత దూరమైనా వెళ్తానంటూ జేసి ప్రభాకర్ రెడ్డి వ్యాఖ్యానించారు. అనంతరం పోలీసులతో ఫోన్లో సంభాషించిన జెసి ప్రభాకర్ రెడ్డి నిరసన విరమించారు.

'యూరియా ఇవ్వలేనప్పుడు పంట మీరే తొలగించండి'..!

కళ్యాణదుర్గం ఆర్డీవో ఎదుట రైతు ఆవేదన

'ఓ రైతుకు కేవలం 50 సెంట్ల సొంత పొలం ఉంది. పొరుగు రైతుకు చెందిన మరో ఎకరం భూమి కౌలుకు తీసుకుని 1.5 ఎకరాల్లో వరి పంట సాగు చేశాడు. ప్రస్తుతం పంట పొట్ట దశలో ఉంది. పంటను కాపాడుకునేందుకు యూరియా కోసం 20 రోజులుగా పట్టణంలోని వివిధ ఎరువుల దుకాణాలకు వెళ్లాడు. ఎక్కడికెళ్లినా యూరియా ఇవ్వాలంటే జింక్ సల్ఫేట్, గంటపీకే మాత్రలు కొనాలని ఎరువుల దుకాణాల యజమానులు షరతు పెట్టారు. దీంతో పంటకు యూరియా వేసుకోలేనని మదనపడిన ఆ రైతు సోమవారం ఏకంగా కళ్యాణదుర్గంలోని ఆర్‌డిఒ కార్యాలయం వెళ్లి ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశాడు. తనకు ఓ బస్తా యూరియా అయినా ఇప్పించండి.. లేదంటే వరి పంటను మీరే(అధికారులే) తొలగించు కోండని నిరసన తెలపడం చర్చనీయాంశమైంది'.

ఆర్డీవో వసంతబాబుకు వినతి పత్రం ఇస్తున్న రైతు శీనునాయక్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

బ్రహ్మసముద్రం మండలం లోని రాయలప్ప దొడ్డికి చెందిన శీనునాయక్ తనకు ఉన్న 50 సెంట్ల పొలంతో పక్కనే వున్న మరొక రైతు నుంచి ఎకరం కౌలుకు తీసుకుని వరి పంట సాగు చేశాడు. పొట్టదశలో ఉన్న వరి పంటకు యూరియా వేయాల్సిన తప్పనిసరి పరిస్థితి ఏర్పడింది. దీంతో సదరు గిరిజన రైతు కళ్యాణదుర్గం పట్టణంలోని వివిధ ఎరువుల దుకాణాలకు వెళ్లి యూరియా కోసం అభ్యర్థించారు. వారు బస్తా యూరియా ఇవ్వడానికి ఇతర ఎరువులు కొనాలని నిబంధనలు చెప్పుకొచ్చారు. ఓ బస్తా యూరియా కోసం ఇతర మందులు కొనాలంటే సుమారు రూ. 3 వేలు అదనంగా రైతు భరించాలి. ఇంత ఆర్థిక స్తోమత లేని రైతు పంటను కాపాడుకునేందుకు యూరియా దొరకలేదని మనోవేదనకు గురయ్యాడు. విధి లేని పరిస్థితిలో సోమవారం కళ్యాణదుర్గం ఆర్‌డిఒ కార్యాలయం వెళ్లి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆర్డీఓ వసంతబాబుకు వినతి పత్రం ఇచ్చారు. స్పందించిన ఆర్డీవో అక్కడే ఉన్న అగ్రికల్చర్ ఎడిఎ ఎల్లప్పను పిలిచి ఆ రైతు సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ఎట్టకేలకు సదరు రైతుకు అధికారులు యూరియా ఇప్పించారు.

ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

'సోలార్' మాయలో పడి భూములు కోల్పోవద్దు

ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-పెనుకొండ

సోలార్ కంపెనీల మాయలో పడి రైతులు భూముల హక్కులు కోల్పోవద్దని ప్రజాసంఘాల నాయకులు సూచించారు. పట్టణంలోని సివిల్ సప్లై గోడౌన్ వద్ద సోమ వారం కరపత్రాలు విడుదల చేశారు. నాయకులు మాట్లాడుతూ సోలార్ కంపెనీల ఏర్పాటు పేరుతో ఎన్‌పి.కుంటతో పాటు మడకశిర, హిందూపురం, పెనుకొండ, పుట్టపర్తి నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో వేలాది ఎకరాల వ్యవసాయ భూములు సేకరిస్తున్నారని తెలిపారు. రైతులకు మాయమాటలు చెప్పి, భయభ్రాంతులకు గురి చేసి, ఏ జెంట్ల ద్వారా భూములు సేకరించే పనిలో ఉన్నారన్నారు. వంశపారంపర్యంగా వస్తున్న భూములపై ఆధారపడి జీవనం సాగిస్తున్న చిన్న, సన్నకారు, రైతుల భూములను బలవంతంగా సేకరించడం తగదన్నారు. రైతులను వ్యవసాయానికి దూరం చేసి వారి కుటుంబ పోషణ కోసం గ్రామాలు వదిలిపోయేలా రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ చేస్తుందని ధ్వజమెత్తారు. ఇకనైనా ప్రభుత్వం బలవంతపు భూసేకరణ ఆపాలన్నారు. ఎకరాకు ఏడాది కేవలం రూ. 30 వేలు కౌలు ఇచ్చి రూ. 80 లక్షలు లాభం పొందే ఆలోచనలో ఉన్నారని వివరించారు. సోలార్ కోసం రైతులు భూములను ఇవ్వదలచు కుంటే కౌలు రేటు పెంచాలని, కంపెనీ లాభాల్లో వాటా ఇవ్వాలని, గ్రామం అభివృద్ధి కోసం నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై ఈ నెల 24వ తేదీ విజయవాడలో జరిగే మహాధర్నాలో రైతులు, వ్యవసాయ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలనివారు పిలుపునిచ్చారు. అనంతరం పట్టణంలో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ బాబావలి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, సివిల్ సప్లై హమాలీ యూనియన్ జిల్లా కార్యదర్శి నాగరాజు, నరసింహ, వలి, ఆనంద్, సుధాకర్, హనుమంతు పాల్గొన్నారు.

25న గుంటూరులో రణభేరి బహిరంగ సభ : యుటిఎఫ్

ప్రజాశక్తి-రొళ్ల

ఈ నెల 25వ తేదీ గుంటూరులోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించ నున్న రణభేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శు లు విఎన్.మాలింగప్ప, వై.జోగప్ప పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం మడకశిర పట్టణంలోని 4వ వార్డు ఎంపియుపి పాఠశాలలో రణభేరి బహిరంగ సభ పోస్టర్‌ను విడుదల చేశారు. యుటిఎఫ్ జిల్లా గౌరవా ధ్యక్షులు కె.భూతన్న, గుడిబండ మండల అధ్యక్షులు టి.మూడ్లగిరియప్ప మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు 12వ పిఆర్‌సి వర్తింపచేయాలని, పిఆర్‌సి కమిషన్ ఛైర్మన్ నియామకం ఆలస్యమైతే 29 శాతం ఐఆర్ ప్రకటించాలని, 11వ పిఆర్‌సి బకా యి అరియర్స్, పెండింగ్ డిఎలు విడుదల చేయాలని, సిపిఎస్ రద్దుచేసి ఒపిఎస్ కొనసా గించాలని డిమాండ్ చేశారు. రణభేరి బహిరంగ సభకు మండలం నుంచి ఉద్యోగ, ఉపాధ్యా యు లు పెద్దఎత్తున తరలివెళ్లి విజయవంతం చేయా లన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు జిఎల్.కదురన్న, రవీంద్ర, ఎల్లప్ప, దేవరాజు, ఎన్.రామాంజప్ప, నంజప్ప పాల్గొన్నారు.

నూతన ఎంపిడిఒ బాధ్యతల స్వీకరణ

గోరంట్ల : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం నూతన ఎంపిడిఒగా ఎస్.కమలబాయి బాధ్య తలు స్వీకరించారు. ఈమె పెనుకొండలో డిప్యూటీ ఎంపిడిఒగా పనిచేస్తూ ఉద్యోగోన్నతి బదిలీపై ఇక్క డికి వచ్చారు. నూతన ఎంపిడిఒకు కార్యాలయ సిబ్బంది పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపిడిఒ కమలాబాయి

చిరు వ్యాపారుల కోసం లోక్ కళ్యాణ్ మేళా

మున్సిపల్ ఛైర్మన్ రమేష్‌కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ రమేష్‌కుమార్

ప్రజాశక్తి-హిందూపురం

చిరు వ్యాపారుల కోసం లోక్ కళ్యాణ్ మేళా నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ ఛైర్మన్ రమేష్‌కుమార్, కమిషనర్ మల్లికార్జున పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పిఎం స్వనిధి, లోక్ కళ్యాణ మేళాపై సోమవారం మెప్మా ఆధ్వర్యంలో పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో చిరు వ్యాపారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటికే సుమారు 5వేల మంది వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డులు జారీ చేశామన్నారు. ఇప్పటికే చాలామందికి పిఎం స్వనిధి సమద్ధి రుణాలు ఇచ్చామన్నారు. బ్యాంకులు తొలిసారి రూ. 15 వేలు ఇస్తారని, ప్రతి నెలా సకాలంలో చెల్లించిన వారికి రెండో సారి రూ. 25 వేలు, మూడో సారి రూ. 50 వేలు రుణాలను అతి తక్కువ వడ్డీకి ఇస్తారన్నారు. సకాలంలో చెల్లించిన వారికి వడ్డీలో 7 శాతం రాయితీ లభిస్తుందన్నారు. చాలామంది వ్యాపారులు మైక్రో ఫైనాన్స్, వడ్డీ వ్యాపారుల వద్ద తక్కువ మొత్తాన్ని అధిక వడ్డీకి తీసుకుని నష్టపోతున్నారన్నారు. కావున చిరు వ్యాపారులు ఈ రుణాలు పొంది వాయిదా పద్ధతిలో సక్రమంగా చెల్లించి ప్రభుత్వం అందించే అన్ని రాయితీలు పొందాలని సూచించారు. అలాగే డిజిటల్ అగ్రికేటర్లతో యుపిఐ లావాదేవీలపై అవగాహన కల్పించి, క్యూ ఆర్ కోడ్‌లను ఉచితంగా అందజేశారు. సొంత ఇల్లు లేని నిరుపేదలు, ఇంటి స్థలం ఉన్న వారికి ఇంటి నిర్మాణం కోసం రుణాలు ఇస్తామని వివరించి, అంగీకార్ పథకం గురించి వివరించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆరోగ్యమేళాలో వ్యాపారులకు బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్నవారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కెనరా బ్యాంక్ మేనేజర్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ మేనేజర్లు, కౌన్సిలర్లు అంజలి, నాగేంద్రమ్మ, అయూబ్, గిరీష్‌కుమార్, దుర్గా నవీన్, మినిస్ట్రీ ఆఫ్ సెంట్రల్ సీడ్స్ డైరెక్టర్ రమేష్‌రెడ్డి, టౌన్ ప్రాజెక్ట్ అధికారి కిష్టప్ప, సిఎంఎం గంగులయ్య, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు విజయలక్ష్మి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్, ఎపి టిడ్కో హౌసింగ్ సిఎల్‌టిసిలు శరవణన్, రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం, వ్యాధులపై మహిళలకు అవగాహన

ప్రజాశక్తి-రొద్దం

మహిళలు పౌష్టికాహారం, ఆరోగ్యం, వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని వైద్యాధి కారులు సోమశేఖర్, భాగ్యలక్ష్మి సూచించారు. మండలంలోని బొక్సంపల్లి గ్రామంలో సోమవారం 'స్వస్థ్ నారి-సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు మాట్లాడుతూ వైద్య శిబిరాలు అక్టోబర్ 2వ తేదీ వరకూ నిర్వహిస్తామని, చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకూ మహిళలు ప్రతి ఒక్కరూ రోగ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. అలాగే వివిధ రకాల క్యాన్సర్, తదితర వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ప్రధానంగా గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాల న్నారు. మానసిక ఆరోగ్యం కోసం పలు సూచనలు చేశారు. సంతులిత ఆహారం తీసుకోవడం వల్ల వారు ఆరోగ్యంగా ఉంటారన్నారు. కుటుంబ నిర్ణయాల్లో మహిళలకు నాయకత్వం ఉండాలన్నారు. శిబిరంలో మొత్తం 163 మంది వివిధ పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్ బాల మురళి, తదితరులు పాల్గొన్నారు. అలాగే చిన్నమంతూరు గ్రామ ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వ అధికారిణి రమ్య ఆధ్వర్యంలో 'స్వస్థ్ నారి-సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పేద మహిళల ఆరోగ్యం తమ బాధ్యతని, అందులో భాగంగానే ఈ వైద్య శిబిరం నిర్వహించామన్నారు. యువ నాయకులు పవన్ వైద్య సిబ్బంది, వైద్య పరీక్షల కోసం వచ్చిన ప్రజలకు భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పవన్, రామాంజి, డీలర్ పాలొన్నారు.

గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

స్వచ్ఛ మడకశిరగా తీర్చిదిద్దుదాం

మడకశిర టౌన్ : స్వచ్ఛోత్సవ కార్యక్రమంలో భాగంగా సోమవారం నగర పంచాయతీ పరిధిలోని 9 ప్రాంతాల్లో మెప్మా ఆధ్వర్యంలో ముగ్గులు వేసే కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలు ఎక్కడ పడితే అక్కడ చెత్తను వేయకూడదని, స్వచ్ఛ మడకశిర సాధించడానికి పట్టణ ప్రజలు సహకరించాలని తెలిపారు. అలాగే ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిర్మూలించాలని.. ఆరోగ్య మడకశిరను సాధించాలని ప్రజలకు తెలియజేస్తూ ముగ్గులు వేశారు. రంగు రంగుల ముగ్గులు వేసిన మహిళలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ ఛైర్మన్ నరసింహరాజ, వైస్ ఛైర్‌పర్సన్ ప్రభావతి, కమిషనర్ జగన్నాథ్, మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.

27 నుంచి వాలీబాల్ టోర్నమెంట్

హిందూపురం : ఈ నెల 27వ తేదీ నుంచి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మనోజ్ జూలియట్(మింటూ) తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ టోర్నమెంట్‌లో ఈ ప్రాంత వాలీబాల్ జట్లతో పాటు కర్నాటక ప్రాంత వాలీబాల్ జట్లు పాల్గొనవచ్చని తెలిపారు. విజేత జట్టుకు రూ. 15 వేలు, రన్నర్స్ జట్టుకు రూ. 7500 నగదు బహుమతి అందజేస్తామని తెలిపారు. క్రీడాకారులకు మధ్యాహ్నం భోజన సౌకర్యం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న జట్లు ఈ నెల 25వ తేదీ లోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

మంత్రి సవితకు వినతి ఇస్తున్న సెడ్స్ మాజీ ఉద్యోగులు

మంత్రికి సెడ్స్ మాజీ ఉద్యోగుల వినతి

ప్రజాశక్తి-పెనుకొండ

న్యాయం చేయాలని కోరుతూ సోషియల్ ఎడ్యుకేషన్ అండ్ డెవలప్మెంట్ సొసైటీ(సెడ్స్) మాజీ ఉద్యోగులు సోమవారం విజయవాడలోని మంత్రి కార్యాలయంలో రాష్ట్ర మంత్రి సవితను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ సెడ్స్‌లో 30 ఏళ్లు పని చేశామన్నారు. సంస్థ ఉద్యోగుల అభివృద్ధి కోసం 'స్టాఫ్ వెల్ఫేర్ ఫండ్' కింద ప్రతి నెలా స్టాఫ్ కాంట్రిబ్యూషన్ ఆదాయ వనరులను బ్యాంకు ఖాతాలో జమ చేశారన్నారు. సంస్థ అధ్యకులు రాజన్ జాషువా 'స్టాఫ్ వెల్ఫేర్ ఫండ్' బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు విత్ డ్రా చేసి పెనుకొండలో సర్వే నెంబర్-671లో జాషువా పేరుపై 9 ప్లాట్లు కొనుగోలు చేసి రిజిస్టర్ చేయించుకున్నారని, తర్వాత మీకు రిజిస్ట్రేషన్ చేసి ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేశారన్నారు. ఆ సంస్థ నుంచి మాకు ఇంటి స్థలాలు ఇప్పించాలని కోరారు. స్పందించిన మంత్రి న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సెడ్స్ మాజీ ఉద్యోగులు సాయిప్రసాద్, వెంకటస్వామి, రమణమ్మ, సునీత, వెంకటేష్, నాగరాజు పాల్గొన్నారు.

ఆర్‌డిటికి అండగా నిలుద్దాం..

పురంలో రాజకీయ ఐక్య వేదిక, విద్యార్థి, ప్రజా సంఘాల ర్యాలీ

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలకు వివిధ రంగాల్లో విశేష సేవలందించిన ఆర్‌డిటికి అండగా నిలుద్దామని రాజకీయ ఐక్య వేదిక, విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పేద వర్గాల్లో వెలుగులు నింపుతున్న ఆర్‌డిటి సంస్థపై కేంద్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం తగదన్నారు. ఆర్‌డిటి సంస్థను ఆదుకోవాలని కోరుతూ సోమవారం రాజకీయ పార్టీలు, విద్యార్థి, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పట్టణం లోని గాంధీ చౌక్ నుంచి రెవెన్యూ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించి, అనంతరం కార్యాలయం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. నాయకులు మాట్లాడుతూ ఎపి, తెలంగాణ రాష్ట్రాల్లోని 3,891 గ్రామాల్లో ఆర్‌డిటి సేవలందిస్తుందన్నారు. పేదలకు 95 వేల ఇళ్లు, వెనుకబడిన గ్రామాల్లో 1700 కమ్యూనిటీ భవనాలు, పాఠశాలలు నిర్మించారన్నారు. ఏటా పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఎంపిక చేసి వారి ఉన్నత విద్య పూర్తయ్యేంత వరకూ ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. అలాంటి సంస్థకు మోడీ ప్రభుత్వం ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ (ఎఫ్‌సిఆర్‌ఎ)ను రెన్యువల్ చేయకపోవడం దుర్మార్గమన్నారు. ఇకనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఆర్‌డిటికి ఎఫ్‌సిఆర్‌ఎను రెన్యువల్ చేయాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ మైనుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాది ఇందాద్, నాయకులు శ్యామ్‌కిరణ్, ఎ.శ్రీనివాసులు, హరికుమార్, రవికుమార్, నారాయణ, మున్నా, తౌసిఫ్, శ్రీరాములు, మహేష్, నౌషాద్, సాకే హరి, వెంకట్రామిరెడ్డి, గంగిరెడ్డి, ఖలీఫా, నరసింహమూర్తి, హనుమంతరాయప్ప, జమీల్, రాముు, జియా, తదితరులు పాల్గొన్నారు.

పురంలో ర్యాలీ నిర్వహిస్తున్న రాజకీయ ఐక్య వేదిక, విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి
www.prajasakti.com

నేటి నుంచి ఆధార్ నమోదు, సవరణ కేంద్రాలు

ప్రజాశక్తి - నల్లమాడ

మండలంలో మంగళవారం నుంచి ఈనెల 26 వరకు సచివాలయాల్లో ఆధార్ నమోదు, సవరణకు ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు అధికారులు తెలిపారు. దసరా సెలవుల నేపథ్యంలో ఆధార్ నమోదు, సవరణ కోసం ఏపీ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తోందన్నారు. దీని కోసం ఎంపిక చేసిన సచివాలయాల సిబ్బందికి ఇప్పటికే సాఫ్ట్వేర్ వినియోగం, బయోమెట్రిక్ విధానం తదితర అంశాల్లో వారికి శిక్షణ ఇచ్చామని అధికారులు తెలిపారు.

నేడు వైద్యశిబిరం

ప్రజాశక్తి - నల్లమాడ

మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి డాక్టర్ బాబ్జాన్ తెలిపారు స్వస్తినారి స్వసక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం ద్వారా ఈ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో వివిధ రకాల రోగాలకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా సునీత

ప్రజాశక్తి - గాండ్లపెంట

గాండ్లపెంట ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా సునీత సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న వెంకటరామిరెడ్డి ఉద్యోగోన్నతిపై కర్నూలు జిల్లా ఆత్మకూరుకు వెళ్లారు. దీంతో సునీతను ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా బాధ్యతలు అప్పగించారు.

పురాతన శాసనం గుర్తింపు

ప్రజాశక్తి - బుక్కపట్నం

జిల్లాలోని అతిపెద్దదైన బుక్కపట్నం చెరువు సమీపంలోని ఏనుగుతూము వద్ద శ్రీకృష్ణదేవరాయల కాలం నాటి శాసనాన్ని విశ్రాంత ఉపాధ్యాయుడు వెంగన్న ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు గుర్తించారు. ఈ శాసనం శ్రీకృష్ణదేవరాయల పరిపాలన వైభవాన్ని గుర్తు చేస్తూ బుక్కపట్నం చారిత్రాత్మకతను తెలియజేస్తోందన్నారు. 500 సంవత్సరాల క్రితం క్రీస్తు శకం 15వ సంవత్సరం ఈ శాసనాన్ని రచించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాసరి శ్రీనివాసులు, తోట అనిల్ కుమార్, టైలర్ శివ, పురుషోత్తం, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి - నల్లచెరువు

మండలంలోని పురాతన సీతారాముల ఆలయ పునర్నిర్మాణానికి నల్లచెరువు మండలానికి చెందిన. లోటరీ మౌలాలీ.లోటరీ ముస్తఫా విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన రూ.1.54 లక్షలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలు

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండల పరిధిలోని గోడ్డు వెలగల పంచాయతీలోని ప్రాథమిక ఉప ఆరోగ్య కేంద్రంలో పోషణ మాసోత్సవాలు భాగంగా మహిళలకు ఆహ్వాన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి వైద్యాధికారి మహేశ్వర మారుతి హాజరై మాట్లాడుతూ పోషకాహారం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బందితో పాటు అంగన్వాడీ కార్యకర్తలు కళావతి, సునంద, రమా దేవి, గంగాదేవి, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు

ముదిగుబ్బ ఎంపిడిఒగా శకుంతల

ప్రజాశక్తి - ముదిగుబ్బ

ముదిగుబ్బ ఎంపిడిఒగా శకుంతల సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఉద్యోగన్నతిపై ఎంపిడిఒగా బాధ్యతలు చేపట్టిన శకుంతల మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

వైద్యశిబిరం

ప్రజాశక్తి - నల్లచెరువు

మండలంలోని ఓరువాయి సచివాలయం పరిధిలో వైద్యాధికారి డాక్టర్ అలేఖ్య ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. 111 మందికి పరీక్షలు నిర్వహించారు. మహిళలకు వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు అంగన్వాడీ సిబ్బంది పోషకాహార శిబిరాన్ని ఏర్పాటు చేసి వాటి యొక్క విలువలను తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గంగాదేవి, సిడిపిఒ వెంకట లక్ష్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పరిగి : మండలంలోని ఊటుకూరు గ్రామ పీహెచ్సీ కేంద్రంలో స్వస్తినారి స్వశక్తి పరివార్ అభియాన్ పథకాన్ని స్థానిక నాయకులతో పాటు డాక్టర్ల ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోవింద్ రెడ్డి, సూర్యనారాయణ, ధనమూర్తి, సింగిల్ విండో అధ్యక్షులు చెన్నకిష్ణ రెడ్డి, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎంపీ

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన శ్యాం ప్రసాద్ ను హిందూపురం పార్లమెంటు సభ్యులు బి కె పార్థసారథి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ జిల్లాలో నెలకొన్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తెచ్చారు.

మహాలక్ష్మి అలంకరణలో అమ్మవారు

ప్రజాశక్తి - కదిరి టౌన్

దసరా శరన్నవరాత్రులలో భాగంగా సోమవారం పట్టణంలోని కుమ్మరవాండ్ల పల్లె లో వెలసిన శ్రీ మల్లాలమ్మ అమ్మవారు శ్రీ మహాలక్ష్మి దేవి అలంకరణ లో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అవినీతిని ప్రశ్నిస్తే దాడులా..? : సిపిఎం

విలేకరులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు, బాధిత మహిళలు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

బుక్కపట్నం మండల కేంద్రంలో వెలుగు సిబ్బంది అవినీతిని ప్రశ్నించినందుకే సిపిఎం నాయకులు పై దాడులకు యత్నించారని సిపిఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఎం నాయకులపై దాడులు జరిగి వారం రోజులు కావస్తున్న నిందితులపై స్థానిక పోలీసులు చర్యలు తీసుకోకపోవడంతో నాయకులు సమస్యను సోమవారం స్థానిక ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ, నాయకులు జివిఎల్ నరసింహులు మాట్లాడుతూ బుకపట్నం మండల కేంద్రంలో డ్వాక్రా సంఘాలకు సంబంధించి ఎనిమిది లక్షల రూపాయల అవినీతి జరిగిందని డ్వాక్రా సంఘ ప్రతినిధులు సిపిఎం సభ్యులకు తెలపగా వారు వెలుగు కార్యాలయానికి వెళ్లి అధికారులను ప్రశ్నించారన్నారు. దీంతో నాయకులపై వారు దాడులకు పాల్పడ్డారన్నారు. ఈ అవినీతిపై మూడు నెలల క్రితమే అధికారులకు ఫిర్యాదు చేసిన వారు పట్టించకపోవడంతో సిపిఎం సభ్యులు ఆ అధికారులను నిలదీశారన్నారు. దీంతో తమ అవినీతి బట్టబయలు అవుతుందని ఈ దాడులకు పాల్పడ్డారని అన్నారు. సీసీ రవీంద్ర, అక్కడ ఉన్న తెలుగుదేశం కార్యకర్త నాగరాజు అవినీతిని ప్రోత్సహించేందుకు ఈ ఘాతుకానికి పాల్పడ్డారని విమర్శించారు. ప్రభుత్వ అధికారులు ఎక్కడైనా ప్రజల సొమ్ము కాజేసిన వారిపై చర్యలు తీసుకుంటారే గాని అలా ప్రశ్నించిన వారిపై దాడులు చేసిన దాఖలాలు ఎక్కడ లేవని అన్నారు. అధికారిపై, ఆయనకి మద్దతు పలికిన తెలుగుదేశం నాయకులపై కేసులు పెట్టి సొమ్మును రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. అవినీతిపరుల పైన చర్యలు తీసుకోకుండా ప్రశ్నించిన వారిపైనే దాడులు నిర్వహించడం సరైన పద్ధతి కాదన్నారు. ఇది ఇలానే కొనసాగితే సిపిఎం ఆధ్వర్యంలో భవిష్యత్తులో ఉద్యమాలు తీవ్ర తరం చేస్తామన్నారు. జరిగిన అవినీతి, సిపిఎం నాయకులపై దాడి విషయాన్నిఎస్పీ సతీష్ కుమార్ కు వివరించగా ఆయన వెంటనే స్పందించి దాడులు నిర్వహించిన సీసీ రవీంద్రను అతని అనుచరుడు నాగరాజు పై వెంటనే కేసులు నమోదు చేయాలని బుక్కపట్నం పోలీసులకు ఆదేశించినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఈఎస్ వెంకటేష్, జంగాలపల్లి పెద్దన్న, లక్ష్మీనారాయణ, సాకే వెంకటేష్, జగన్ తో పాటు పెడపల్లి బాబా, గంగాధర్ ముత్యాలు, నరసింహులు, రమాదేవి శ్రావణి సేక్సా భాను, షేక్ అజాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా విద్యార్థులకు బహుమతులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఎస్కే యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సౌత్ జోన్ టోర్నమెంట్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. పుట్టపర్తి మండల పరిధిలోని జగరాజు పల్లి మంగళకర డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో సోమవారం స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ఎస్కే యూనివర్సిటీ నిర్వహించిన సౌత్ జోన్ కబడి, వాలీబాల్ ,హ్యాండ్ బాల్ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఈసందర్భంగా సన్మానించారు. మంగళకర విద్యాసంస్థల ట్రస్టీ సురేష్ కుమార్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రీడల పట్ల ఆసక్తి జూపి ప్రతిభ కనబరిచి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంగళకర డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సురేష్ కుమార్, ఏవో జయ చంద్రారెడ్డి, ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ ఆర్య ప్రకాష్, పీడీ శ్రీనివాసులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా విద్యార్థులతో ఉపాధ్యాయులు, తదితరులు

పడకేసిన పారిశుధ్యం

ప్రజాశక్తి - కొత్తచెరువు

కొత్తచెరువు గ్రామపంచాయతీలో పారిశుధ్యం పడకేసింది. పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించకపోవడంతో ఎక్కడ చూసినా చెత్తాచెదారం పేరుకుపోయింది. మేజర్ పంచాయతీలోని వీధులలో సచివాలయాల వద్ద అంగనవాడి కేంద్రాల వద్ద గ్రంథాలయం వద్ద, గ్రామంలో ఏ వీధిలో చూసినా చెత్త పేరుకుపోయింది. పర్యవేక్షించాల్సిన కార్యదర్శి సెలవుపై వెళ్లడంతో మిగిలిన అధికారులు పట్టించుకోవటం లేదు. పంచాయతీకి సంవత్సరానికి కోట్ల రూపాయల ఆదాయం ఉన్నా కూడా అభివృద్ధి పనులు చేయడంలో పూర్తిగా విఫలమవుతున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పారిశుధ్య వ్యవస్థను చక్కదిద్దాలని వారు కోరుతున్నారు.

రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త

విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలి

విఆర్ఎల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పెద్దన్న

ప్రజాశక్తి -పుట్టపర్తి అర్బన్

విఆర్ఎల సమస్యలు వెంటనే పరిష్కరించాలని విఆర్ఎల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పెద్దన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం స్థానిక కలెక్టరేట్ లో కలెక్టర్ శ్యాం ప్రసాద్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆసంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పెద్దన్న, నాగరాజు పాల్గొన్నారు. వీరికి మద్దతుగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, షేక్షావలి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలని మూడు రోజులుగా ఆర్డీవో కార్యాలయం ముందు నిరసన దీక్షలు చేపట్టామన్నారు. అర్హత కలిగిన ప్రతి వీఆర్ఏలకు ఉద్యోగోన్నతి కల్పించాలని పే స్కేల్ అమలుచేసి 21 వేల రూపాయలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. విధులు నిర్వహించలేని వీఆర్ఏల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశము కల్పించాలని కోరారు.

అవినీతి సొమ్మును రికవరీ చేయాలి

తమ సమస్యను వివరిస్తున్న మహిళాసంఘం సభ్యులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

స్వాహా చేసిన తమ సొమ్మును రికవరీ చేయించాలని బుక్కపట్నం మండల కేంద్రంలోని శ్రీ సంతోషి మాత మహిళా సంఘం సభ్యులు కోరారు. ఈమేరకు వారు సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీని కలిసి తమ సమస్యను వివరించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ 8 లక్షల రూపాయలు ఈ సంఘంలోని సభ్యురాలే తన సొంత ఖాతాలో జమ చేసుకుందని ఈ విషయం గతంలోనే అధికారుల దృష్టికి తీసుకువెళ్లిగా వారు పట్టించుకోకపోవడంతో సిపిఎం నాయకులను ఆశ్రయించాల్సి వచ్చిందని చెప్పారు. మహిళా సంఘం సభ్యురాలు అశ్వని మాట్లాడుతూ తమ సంఘం అధ్యక్షురాలైన కోమల అనే మహిళ ఎనిమిది లక్షల రూపాయలు సంఘ సభ్యులు సొమ్మును తన సొంత ఖాతాలోకి బదలాయించుకుని ఆమె ఇంటి నిర్మాణం పూర్తి చేసుకుందన్నారు. ఇదే విషయాన్ని పలుమార్లు వెలుగు సిబ్బందికి తెలిపిన అధికారులు ఒకరిపై ఒకరు వేసుకుంటారే గాని కోమలపై చర్యలు తీసుకోవడం కాని సొమ్ము రికవరీ కానీ చేయలేదని అన్నారు. దీంతో తాము సిపిఎం నాయకులను ఆశ్రయించామని చెప్పారు. మరో సంఘ సభ్యురాలు సాహిన మాట్లాడుతూ తమ సొమ్ము ఇవ్వమని పలుమార్లు అడిగామని ఇదే విషయాన్ని అధికారులు దృష్టికి తీసుకు వెళ్లగా ఇంటిని అమ్మి సొమ్ము చెల్లిస్తానని చెప్పిందని ఇంటిని కొనుగోలు చేయడానికి సైతం తాము ఒక వ్యక్తిని చూపించి అతని ద్వారా ఇంటిని విక్రయించేందుకు చర్యలు చేపట్టగా ఆమె కుమారుడు తమపై దాడులు చేశారని వాపోయారు. విషయాన్ని బుక్కపట్నం పోలీసులకు తెలిపిన వారు కోమలపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. మరొక సభ్యురాలు నాగజ్యోతి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి తమకేం సంబంధం అని బుకాయిస్తున్నారని, 8 లక్షల రూపాయలు సొమ్మును రికవరీ చేయమంటే ఒకరిపై ఒకరు వేసుకుంటూ తీవ్ర ఇబ్బందులకు గురి చేశారని వాపోయారు. తమకు జరిగిన అన్యాయాన్ని సిపిఎం నాయకులకు తెలపగా జరిగిన అవినీతిని వారు ప్రశ్నించినందుకే వారిపై దాడులు నిర్వహించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు సాహిన అశ్వని, మునిరా శాంతమ్మ ,జయంతి, నాగజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి టోర్నమెంట్‌లో మానస ప్రతిభ

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండల కేంద్రంలోని శ్రీ పొట్టి శ్రీరాములు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని మానస జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచింది. సెప్టెంబర్ 12న అనంతపురంలో ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి ఫినిషింగ్ టోర్నమెంట్లో మానస ప్రథమ స్థానంలో నిలిచి పాఠశాలకు గౌరవం తెచ్చింది. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయురాలు శశికళ, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు రామ్మూర్తి నాయక్, మారుతి ప్రసాద్, ఇతర ఉపాధ్యాయులు మానసకు అభినందనలు తెలిపారు. తోటి విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. జిల్లా స్థాయిలో మెరుగైన ప్రదర్శన కనబరిచిన మానస, అక్టోబర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొననుందని హెచ్‌ఎం శశికళ వెల్లడించారు.

విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ప్రధాన రహదారులపై గుంతలను పూడ్చండి : సిపిఎం

ప్రజాశక్తి-కొత్తచెరువు

స్థానిక నాలుగు రోడ్ల కూడలిలోని ప్రధాన రహదారిలో ఏర్పడిన గుంతలను పూడ్చాలని సిపిఎం మండల కార్యదర్శి ముత్యాలు అధికారులను కోరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రహదారి మీదుగా జిల్లా ఉన్నతాధికారులు ప్రజాప్రతినిధులు నిత్యం వెళుతుంటారని వారికి ఈగుంతలు కన్పించడం లేదా అని ప్రశ్నించారు. ప్రధాన రహదారుల్లో ఆక్రమ భవనాలను తొలగించి సత్యసాయి బాబా జన్మదినోత్సవం లోపల ఈ పనులన్నీ పూర్తిచేసి నూతన రోడ్డు వేసే కార్యక్రమాన్ని పూర్తి చేయాలనికోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు శంకర్ రెడ్డి, నాగభూషణ్, భాష, నాగరాజు, శ్రావణి, లక్ష్మమ్మ, పెద్దన్న, షబానా, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలు చూపుతున్న నాయకులు

ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పాలు, బ్రెడ్లు పంపిణీ

పరిటాల శ్రీరామ్ పుట్టిన రోజు సందర్భంగా సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ జన్మదిన వేడుకలను సోమవారం నియోజకవర్గ వ్యాప్తంగా టిడిపి శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. గాంధీనగర్ లోగల శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పేద ప్రజలకు అల్పాహార విందు అందజేశారు. ఎన్టీఆర్ సర్కిల్ లో గల ఎన్టీఆర్ విగ్రహానికి టిడిపి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం పట్టణ ప్రభుత్వ ఆసుపత్రిలో గల రోగులకు బ్రెడ్లు,పండ్లు పంపిణీ చేశారు.మధ్యాహ్నం పట్టణంలో గల రెండు అన్నాక్యాంటీన్ లలో పేద ప్రజలకు అన్నదానం చేశారు. పలు గ్రామ,వార్డులలో పేద ప్రజలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. 26 వ వార్డ్ ఎల్ సి కె పురంలో ఉచిత కంటి చికిత్స శిబిరం నిర్వహించారు. 25 వ వార్డ్ లో గల టిడిపి నాయకులు స్థానిక మున్సిపల్ హైస్కూల్లో స్వచ్ఛత సేవ కార్యక్రమాన్ని నిర్వహించి స్కూల్ ఆవరణ లోగల పిచ్చి మొక్కలను శుభ్రం చేశారు. 23వ వార్డ్ యాదవ వీధిలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు, ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు పరిసే సుధాకర్,నాయకులు సందా రాఘవ, మహేష్ చౌదరి, నాగూర్ హుస్సేన్,రహీం బాషా, మాధవరెడ్డి,రాంపురం శీన, రూరల్ నాయకులు, పలువురు టిడిపి మహిళ నాయకులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో రోగికి పండ్లు, బ్రెడ్లు అందజేస్తున్న నాయకులు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నల్లచెరువు : మండల పరిధిలోని ఎర్రగుంటపల్లి వద్ద తనకల్లు వైపు వెళుతున్న కారును వెనకాల నుండి ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో ద్విచక్ర వాహన దారులు గాయపడ్డారు. క్షతగాత్రులను 108 లో కదిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

వాహనం ఢీకొని ఆవు మృతి

చిలమత్తూరు : మండలంలోని శిర – కొడికొండ జాతీయ రహదారి పై తుమ్మలకుంట సమీపంలో ఈచర్ వాహనం ఢీకొని ఆవు మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. టమోటా కాయలతో వెళ్తున్న ఈచర్ వాహనం రోడ్డును దాటుతున్న ఆవును ఢీకొనడంతో అది అక్కడికక్కడే మృతి చెందింది.

శ్రీగంధం, గంజాయి స్వాధీనం.. ముగ్గురు అరెస్ట్

రాయదుర్గం : గంజాయి, శ్రీగంధం చెక్కలను స్వాధీనం చేసుకుని ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు సిఐ జయానాయక్ తెలిపారు. సిఐ తెలిపిన వివరాలు.. స్థానిక కణేకల్లు రోడ్డులోని చంద్రబాబుకాలనీలో నిషేధిత పదార్థాలు ఉన్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో వెళ్లి దాడులు చేశామన్నారు. పోలీసు లను గమనించిన ముగ్గురు వ్యక్తులు పారిపోవడానికి ప్రయత్నించగా వెంబడించి పట్టుకున్నారు. వారిని విచారించగా ముత్తరాశి అనిల్, ముత్తరాసి హరికృష్ణ, మరో మహిళగా గుర్తించారు. గొల్ల అఖిల్‌కు, ముత్తరాశి హరికృష్ణకు కొంతకాలంగా మనస్పర్థలు ఉన్నాయన్నారు. ఈ క్రమంలో అఖిల్‌ను ఏదైనా కేసులో ఇరికించాలని కుట్ర పన్నిన హరికృష్ణ తన మామ ముత్తరాసి అనిల్ సహకారంతో శెట్టూరు మండలం చిన్నంపల్లిలోని ముత్తరాశి శంకర్ వద్ద రూ. 3వేల విలువ చేసే గంజాయిని కొనుగోలు చేసి వాటితో పాటు అక్రమంగా సేకరించిన శ్రీగంధం దుంగలను తీసుకొచ్చి గొల్ల అఖిల్ ఇంటి మెట్ల కింద దాచడానికి ప్రయత్నిస్తుండగా పోలీసులు అరెస్టు చేశారు. వారి నుండి 584 గ్రాముల గంజాయి, సుమారు 10 కిలోల బరువు గల 9 గంధపు చెక్కలు, కొడవలి, మోటార్ సైకిల్, సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గంజాయి సాగు చేస్తున్న శెట్టూరు మండలం చిన్నంపల్లి గ్రామానికి చెందిన ముత్తరాశి శంకర్ గురించి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి - కొత్తచెరువు

కొత్త చెరువులోని కమ్మ పాలెం ప్రాంతానికి చెందిన అప్ప కొండప్ప గారి నాగేంద్ర (54) అనే ఉపాధ్యాయుడు సోమవారం గుండెపోటుతో మృతిచెందాడు. ఈయనకు 1998 క్వాలిఫైడ్ టీచరుగా ఉద్యోగం రావడంతో గుడిబండ మండలంలోని ముద్దనకుంట గ్రామంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. దసరా సెలవులు రావడంతో ఇంటివద్ద ఉన్న సమయంలో గుండెపోటుకు గురయ్యాడు. దీంతో నాగేంద్రను సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. మృతునికి భార్య శాంతి, కుమారుడు, కుమార్తె, ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలను చట్ట పరిధిలో విచారణ జరిపి పరిష్కరిస్తామని జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించారు. వివిధ రకాల సమస్యలతో వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను జిల్లా ఎస్పీ స్వీకరించారు. ప్రజల నుండి వచ్చిన సమస్యలపై పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. తక్షణమే ఆ ఫిర్యాదులను గూర్చి సంబంధిత పోలీస్ అధికారులకు తెలిపి చట్ట ప్రకారం విచారణ జరిపి త్వరితగతిన పరిష్కారం అందించి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు లీగల్ అడ్వైజర్ సాయినాథ్ రెడ్డి, డిసిఆర్‌బి సిఐ శ్రీనివాసులు, సిఐ సురేష్ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధురాలి సమస్యను వింటున్న ఎస్పీ సతీష్‌కుమార్

'మన డబ్బులు ..మన లెక్కలు' యాప్‌పై అవగాహన

ప్రజాశక్తి - చిలమత్తూరు

మహిళా స్వయం సహాయక బృందాల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మన డబ్బులు మన లెక్కలు' అనే యాప్‌పై సోమవారం మండల కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ యాప్ ద్వారా మహిళలు తమ పొదుపు, అప్పుల వివరాలను పారదర్శకంగా తెలుసుకోవచ్చని అధికారులు వివరించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం నారాయణ, లక్ష్మీదేవి, అంజనమ్మ, తెలుగు సిసి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న అధికారులు, మహిళలు

క్రీడాదుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - పరిగి

పరిగి మండలంలోని రబ్బీ క్రీడల్లో జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారిణిలకు మండల విద్యాశాఖ అధికారి లక్ష్మీదేవి, పరిగి గ్రామ నివాసి,వడ్డే శ్రీకాంత్ చేతుల మీదుగా క్రీడా దుస్తులు, బ్యాగులను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా రాష్ట్ర సౌత్ జోన్ స్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు ప్రోత్సాహకంగా 8 మంది విద్యార్థినులకు క్రీడా దుస్తులు బ్యాగులను అందజేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి శేషాచలం, కవిత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు క్రీడాదుస్తులు అందజేసిన దృశ్యం

విగ్రహావిష్కరణకు ఉప ముఖ్యమంత్రికి ఆహ్వానం

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి పట్టణ బలిజ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణ దేవరాయల విగ్రహావిష్కరణ కార్యక్రమానికి కదిరి డివిజన్ బలిజ సేవా సంఘం నాయకులు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను ఆహ్వానించారు. ఈ మేరకు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం అమరావతిలో డిప్యూటీ సీఎం ను కదిరి డివిజన్ బలిజ సంఘం నాయకులు కలిశారు. రాయల విగ్రహాన్ని ప్రారంభోత్సవానికి రావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు. తన విజ్ఞప్తికి డిప్యూటీ సిఎం సానుకూలంగా స్పందించినట్లు సంఘం జేఏసీ నాయకులు పసుపులేటి సురేష్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రంలో బలిజ సంఘం నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌తో కదిరి నాయకులు